# ఒక చావు

రాత్రి భోజనం చేసిరావాలని బసవరాజు ఆ ఇరుకు వీధిలోంచి పోతుండగా రాందాసు ఇంటి ముందు ముగ్గురు ఎదురొచ్చి అతడికి అడ్డంగా నుంచున్నారు. ఐదుగురయ్యారు. పదిమందయ్యారు. రైతులు. వాళ్లంతా అతడిని చుట్టుముట్టారు. ఎవరూ మాటాట్టం లేదు. వాళ్ల కోపోద్రేకాలు ఎంత తీవ్రంగా ఉన్నాయో ఆ మౌనమే చెప్తున్నది.

ఆ రాత్రి చీకటి మరింత దట్టంగా ఉంది. అసలే వర్షాకాలం. పైన ఆకాశం నిండా వర్షపు మేఘాలు. అప్పుడప్పుడు ఉరుములు, మెరుపులూ.

ఆ ఊళ్లో ఇంకా ఆముదపు దీపాలే. హరికేన్ లాంతర్లు ఉన్నా అవి బైటికి కన్పించవు. లోపల ఎక్కడో ఉంటాయి. ఇళ్లముందు పశువుల సాలలు. ఆ రొచ్చూ, ఆ పేడ వాసనా, దానికి తోడు దోమలూ, ఇరుకు ఇళ్లూ... గాలీ వెల్తురూ లేని కొంపలు. మనుషులు మంచిగుడ్డలు వేసుకోరు. బట్టలు ఉతుక్కుంటారో ఏమోగాని అవి మాసిపోయినట్టే ఉంటాయి. ఆడవాళ్లు రవికెలు వేసుకోరు. అక్కడ కట్టూబొట్టూ తీరే అంత. పొరుగు రాష్ట్రం ఒరియాప్రజల ఆచార ప్రభావమో ఏమో. అన్నీ మూఢనమ్మకాలే. తుమ్మితే తప్పు. దగ్గితే తప్పు. గుడ్డి బతుకులు. జీవితంలో వీళ్లకు అందమంటే, ఆనందమంటే ఏమిటో తెలుసునా అన్న అనుమానం కలుగుతుంది. ఉత్త అటవీజాతిమనుషులు వీళ్లు అనుకునేవాడు బసవరాజు.

సుమారు మూడు నెలల కిందట బసవరాజు — ఆ ఊళ్లో కొత్తగా మిడిల్ స్కూల్ — అంటే ఆరు, ఏడు, ఎనిమిది తరగతులున్న పాఠశాల అన్నమాట — పెట్టినప్పుడు అతడు ప్రధానోపాధ్యాయుడుగా వచ్చాడు. ఆ చుట్టూ ఉన్న ప్రకృతిని చూసి ఎంత మురిసిపోయాడో — ఆ ఊళ్లో అడుగు పెట్టినప్పుడు మాత్రం భయపడిపోయాడు. కాని తొలిఉద్యోగం తప్పదు. తొలిరోజునే తన కమ్యూనిస్ట్ స్నేహితునికి ఒక ఉత్తరం రాశాడు. ఈ ఊరునిండా అజ్ఞానం అన్న బురద, సంస్కారహీనం అన్న దుర్గంధం, పేదరికం అన్న పెద్దరోగం, నిరక్షరాస్యత అన్న అంధత్వం — తొలిసారి చూసి భయపడ్డాను. జమీందారీ ఊరు కావటంవల్లనో ఏమో ఊళ్లో వ్యభిచారం ఉంది. అసలు ఇక్కడ జనం అటు పూర్వతరాలకు చెందినవాళ్లూ కారు ఇటు మనతరానికి చెందినవాళ్లూ కారు. ఇట్లాంటి ఊళ్లో పడ్డానా అని నిజంగానే జడుసుకున్నాను. అయితే అంతలోనే ధైర్యం వచ్చింది. నేను ఉపాధ్యాయుడిని. ఉపాధ్యాయుడు మాత్రమే ఇక్కడ ఈ జనంలో మార్పు తీసుకురాగలడు. విద్య అన్నది ఒక దివ్యాస్త్రం. అక్షరాస్యత కాగడాని చేతిలో పట్టుకున్నవాడే ఈ చీకటిలో దారిచేసుకుని పోగలడు. ఇక్కడ ఈ జనంలో కొత్త చైతన్యాన్ని మేల్కొల్పగలవాడు ఒక్క గురువే. నూటా ఏభైమంది పిల్లలు అతడి సైన్యం. వాళ్లే ఈ అజ్ఞానం మీద ఎక్కుపెట్టిన ఆయుధాలు. త్వరలోనే గొప్ప మార్పు తీసుకు రాగలనని ధైర్యం. దాంతో ఉత్సాహంగా ఉంది. ఇక్కడకు నేను వచ్చింది కేవలం నిరక్షరాస్యతనూ అజ్ఞానాన్నీ తొలగించటానికే. ఈ ఉపాధ్యాయవృత్తి ఎంత ఇష్టమని! ఉపాధ్యాయుడు ఎంత అదృష్టవంతుడని! ఈ చిన్నారిపిల్లల్ని చూసినప్పుడు నా మనసూ హృదయమూ తల్లిలా అయిపోయితుంది. వాళ్లంతా అప్పుడే సూర్యోదయానికి విచ్చుకుంటున్న పువ్వుల్లాగ కన్పిస్తారు. ఆ ముఖాల మీద అమాయకత్వం, వాళ్లప్రేమ చాలు ఎన్నో జన్మల పుణ్యఫలంగా అన్పిస్తుంది. వాళ్లకు నాపైన ఉన్న అభిమానం. నిజం గురుదేవోభవ అని మన పెద్దలు ఎందుకన్నారో ఇప్పుడు ఇక్కడ అడుగుపెట్టినప్పుడు అనుభవం అయింది. తొలిసారి ఉద్యోగ జీవితంలో అడుగుపెట్టిన నాకు ఇంతటి ప్రేమ లభించటం మహాభాగ్యం అన్పిస్తుంది. ఈ గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి. మీరు — నన్నూ, ఇక్కడ మా పాఠశాలనీ, నా పిల్లల్నీ, ఈ ఊరునూ, ఇక్కడ అద్భుతమైన కొండల్నీ, ప్రకృతి వరప్రసాదం అన్నట్టు కన్పించే గొప్ప అందాలనీ చూట్టానికి — ఎప్పుడొస్తారు?

బసవరాజు ఎంతో ఆవేశంతో ఆ ఉత్తరం చాలా సుదీర్ఘంగా రాశాడు.

అతడు బళ్లో చేరిన తొలిరోజునే ఆ ఊరంతా అతడి గురించి చెప్పుకున్నారు. పంతులు చాలామంచివాడు అనుకున్నారు. పంతులు బొమ్మలాగ అందగాడు అనుకున్నారు. అంతే కాదు పంతులు చాలా తెలివైన వాడు అని కూడా వాళ్లు మెచ్చుకోసాగారు. మొదట్లో బసవరాజు కమ్యూనిస్ట్ అని అనుకున్నప్పటికీ తర్వాత కొన్నాళ్లకు పంతులు ఏ ఇష్టూ కాదు అనుకున్నారు. అతడికి సోవియట్ రష్యాకన్నా అమెరికా అంటేనే మక్కువా మన్ననా ఉన్నాయని కూడా తెలిసివచ్చింది.

అక్కడకు ఓ నెలదినాలు గడచిన తర్వాత బసవరాజు తన రచయిత మిత్రునికి ఉత్తరం రాస్తూ 'స్వప్నలోకంలోకి వచ్చి పడినట్టుంది. ఇక్కడ ప్రకృతి శోభముందు ఏ ఐశ్వర్యమూ, ఏ సంపదా, ఏ పదవీ సరితూగదు. ఇంత సుందరమైన పురాతన ప్రకృతి మనకు అర్థంకాని రహస్యం అన్పించసాగింది. ఇంత గొప్పఅందం ఇంకెక్కడన్నా ఉందా దేశంలో అని ఆశ్చర్యపోతాము. కొండలు మనం చిత్రాల్లో, ఛాయాచిత్రాల్లో నీలంగా ఉన్నట్టు చూస్తాం. కాని ఇక్కడ కొండలు మాత్రం ముదురాకు పచ్చరంగులో ఉంటాయి. నిండా పర్వతారణ్యాలు. నా హృదయానికీ ఇక్కడి భౌగోళికమైన అందాలకీ మధ్య జన్మ జన్మలఅనుబంధం ఏదో ఉన్నట్టే అన్పించసాగింది. ఇక్కడకు వచ్చిన తర్వాతనే ఆ స్పందన తెలుస్తున్నట్టుంది. అదే సంగతి చెప్పుకోవాలనిపిస్తున్నది. అంతకు పూర్వం అసలు చూపేలేనట్టు, కండ్లకు ఇప్పుడే చూపు వచ్చినట్టు ఉంటున్నది. ఇక్కడ జనాలకి ఈ ప్రకృతి సౌందర్య మహావైభవం ఏమిటో తెలీదు. ఇప్పుడు నా శ్రమంతా అదే. ప్రకృతి అందాలకు వాళ్ల చూపును మేల్కొల్పాలి. వారికి ఈ స్పృహ ఒకసారి కలిగిందా — వాళ్లే తమ గ్రామాన్ని నందనవనం చేసుకుంటారు. చదువు ఒక్కటే ఈ ప్రకృతి అనంత శోభవేపు మన చూపును మళ్లించ గలుగుతుంది. సముద్రం ఒడ్డున పుట్టి పెరిగిన నా జీవితానికి ఈ అడవులూ, కొండలూ, వాగులూ, చెరువులూ, చెరకుతోటలూ, పంటపొలాలూ కండ్లపండువుగా ఉంది. పదిరోజుల కిందట మా స్వగ్రామం వెళ్తే అక్కడ సముద్రం ఇప్పుడు మరింత మహాద్భుతంగా కన్పించింది.

ఇక్కడ నిత్యజీవితంలో కూడా ఏదో చెప్పలేని ఆకర్షణ. వేకువ జామున హరేకృష్ణ భజన గీతాలు పాడుకుంటూ భగవత్ సంకీర్తన జరుగుతుంది. ఊళ్లో అన్ని వీధుల్లో భజనగీతాలు పాడుకుంటూ భగవత్ భక్తి తాదాత్మ్యంతో ఆడుకుంటూ పోతున్న ఆ దృశ్యం మనోహరంగా ఉంటుంది. ఊళ్లో పండగలూ, పూజలూ, వ్రతాలూ, నోములూ ప్రతినిత్యం ఉండనే ఉంటాయి. ఈ పూజలు కొన్ని మూర్ఖంగా

ఉంటాయి. జబ్బు మనిషిని పట్టుకుని దేవాలయంలో పూజలు చేస్తారు. కాని వాళ్లకు ఆస్పత్రి గుర్తురాదు. అట్లాగే మందులకు బదులు మంత్రాలు. ఇట్లాంటివి చూసినప్పుడే నాకు దిగులు.

ఈ ఊరు చూడాలి మీరు. తప్పక రావాలి. ఇక్కడ హోటల్ అంటూ ఏదీ లేదుగాని ఓ ముసలమ్మ మాలాంటి అయిదారుగురుకోసం పూటకూళ్లమ్మ పద్ధతిలో రెండుపూటలా అన్నం పెట్టుంది. భోజనం రుచిగా కొత్తగా ఉంటుంది. ఒరియా వంటకాలు. ఆ ముసలమ్మ మాత్రం ఒక గొప్ప కళాఖండం. ఈ సారి మన మిత్రులెవరన్నా కెమెరా తీసుకొస్తే ఆమె ఫోటోలు తీయించాలి. మీరు ఎంత సంతోషపడతారో. ఎన్నో కథలు దొరుకుతాయిక్కడ మీకు. రాసుకోవచ్చు. ఈ ఊరుకు ఇప్పుడిప్పుడే అలవాటు పడుతున్నాను. ఇష్టపడుతున్నాను. ఇది నా ఊరే అన్పిస్తున్నది.

ఇక్కడకు కిలో మీటరు పడమరగా పోతే సవర పల్లెలు. కొండవాళ్లు. వాళ్ల జీవితం. మనం కొన్ని శతాబ్దాలు వెనక్కి వెళ్లి చరిత్రలో జీవించిన అనుభూతి కలుగుతుంది వాళ్లను చూసినప్పుడు. కొత్త నాగరికత వెల్లువ — ఈ ఆది మానవుని సాంస్కృతిక సంపదను తుడిచిపెట్టేసుకు పోతుందన్న భయం కలుగుతుంది. ఆ సంస్కృతిని అట్లా కాపాడుతూ వీరి జీవితాలను మెరుగుపరచటం సాధ్యం కాదా అన్న ప్రశ్న నాకు.

భోజనానికి బసవరాజు బయల్దేరుతుంటే ఇంటామె మామ్మ 'తెల్లారి కోవిల దగ్గర నూతికాడ రాందాసు మనవరాల్తో...' అని తనేం చెప్పాలో తనకే మాటరాక మామ్మ 'నిజమేనా బాబూ. మనుషులు మంచోళ్లు కారు' అని అన్నప్పుడే గొడవ సంగతి బసవరాజుకు సూచన ప్రాయంగా తెలిసింది. అయితే ఇంత ఆపద తనకు ఎదురవుతుందని అనుకోలేదు.

ఇప్పుడు తెలిసింది బసవరాజుకు తను తప్పు చేసినట్టు. పెద్ద తప్పే. సూరమ్మ అనే ఆ ఊరు అమ్మాయిని, ఓ చిన్న రైతు కూతురుని — కులం, చదువు, ఆస్తి, కట్నం, హోదా వంటివాటిని పట్టించుకోకుండా పెళ్లి చేసుకుంటే అది గొప్పసంస్కారం అవుతుందని, ఆదర్శాలను వల్లించటం కాదు ఆచరించాలన్న తన అభీష్టం నెరవేరుతుందని అతడు భావించాడు. కాని ఎంత తొందరపాటు!

సమాజంలో మార్పు రావాలంటే కులభేదాలు పోవాలి. కులభేదాలు తొలగించ టానికి పెళ్లి ఒక దారి. అట్లా ఆలోచించాడే తప్ప —

బసవరాజు రోజూ ఆ ఊరుకు పడమరగా ప్రవహిస్తున్న ఏటిలోనే స్నానం చేస్తాడు. కాని గత రెండు మూడువారాలుగా పెద్ద వర్షాల వల్ల నీళ్లు బురదగా వస్తున్నాయి. అందువల్ల ఇప్పుడు ఈశ్వరాలయం దగ్గర నూతికాడ స్నానం చేస్తున్నాడు. సూరమ్మ రోజూ ఆ ఈశ్వరాలయం మెట్టకి వస్తుంది. ఆ మెట్ట మీద వాళ్ల కాయగూరల దొడ్డి ఉంది. ఆ దొడ్లోనే వాళ్ల గడ్డికుప్పలున్నాయి. కాయగూరల పాదులున్నాయి. పిడకల కుచ్చెర్లున్నాయి. అక్కడే వాళ్లు పిడకలు చేసి ఎండబెట్టుకుంటారు. కాయగూరలు తీసుకుపోవటానికో, పిడకలు చెయ్యటానికో, తీసుకుపోవటానికో ఆ ఇంటి వాళ్లు అక్కడకు వస్తుంటారు. వాళ్లతో పాటు సూరమ్మ కూడా వస్తూఉంటుంది.. ఉదయం ఆ అమ్మాయి ఒక్కతే వచ్చింది.

ఆ అమ్మాయితో మాట్లాడాలని సరదా పడుతున్న బసవరాజుకు సందర్భం అనుకూలించింది. నీళ్లకోసం ఓ కడవ పట్టుకుని నూతి దగ్గరకు సూరమ్మ వచ్చింది. ఆ మొక్కలకు నీళ్లు ఇక్కడనించే పోస్తారు. ఇదివరలో వేరే వాళ్లు వచ్చి నీళ్లు తీసుకుపోయేవారు. ఇవేళ సూరమ్మ వచ్చింది. మాటాడాలనిపించి బసవరాజు పేరు అడిగాడు. అంతవరకు ఆ పిల్ల పేరు బసవరాజుకు తెలీదు. చదువుకున్నావా అని అడిగాడు. అయిదో తరగతి చదివి ఆపేసినట్టు ఆ పిల్ల చెప్తే, చిన్న దానివి ఇంకా చదువు కోవాలి కదా — ఇప్పుడు చదువు కోవచ్చు కదా అన్నాడు. ఆ అమ్మాయి సిగ్గు పడి, నవ్వి, నీళ్ల కడవ తలకెత్తుకుని వెళ్లిపోయింది, వాళ్ల కూరగాయల దొడ్డివేపు.

ఉదయం కోవిలి కాడనూతి దగ్గర జరిగింది ఇంతే.

కాని అప్పుడు కూడా బసవరాజుకు తెలీలేదు. సూరమ్మకు పెళ్లయిందని. ఇంత చిన్న పిల్లలకు పెళ్లవుతుందని తెలుసుకోలేకపోయినందుకు బసవరాజు తన బుద్ధి తక్కువతనానికి బాధపడుతున్నాడు.

తనతో పాటే దగ్గర్లోనే ఓ పల్లెటూళ్లో ఉద్యోగంలో చేరిన తనతో పాటు బి.ఇ.డి ట్రైనింగ్ చేసిన స్నేహితునికి నిన్ననే ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరంలో రాసిన తన అభిప్రాయాలు ఇప్పుడు నిజమవుతున్నట్టు ఈ అనుభవం రుజువుచేసింది.

ఈ ఊళ్లో గోడలనిండా కిందటి ఎన్నికలరాతలు కన్పిస్తున్నాయి. జోడెద్దులా, కొడవలీ సుత్తీ, ఆకాశంలో వంటరి నక్షత్రం, మువ్వన్నెల జెండాలూ, ఎర్రజెండాలూ, నీలం నక్షత్రం జండాలూ ఊళ్లో అక్కడక్కడా ఇంకా కన్పిస్తూనే ఉన్నాయి. సమితి కాంగ్రెస్ వాళ్ల చేతిలో ఉందంట. ఊరు మాత్రం స్వతంత్ర పార్టీ. గౌతు లచ్చన్న,

ఎన్.జి.రంగా ఇక్కడ పలుకు బడి ఉన్న నాయకులు. ఈ జనం అమాయకులూ, తెలివి తక్కువ వాళ్లూ అని మొదట్లో అనుకున్నాను గాని నా అభిప్రాయం పొరపాటు. అట్ప్పో మనలాంటి వాళ్లను వేలంవేసి అమ్మేయగలరు. గంజాయి దొంగవ్యాపారానికి ఈ ఊరు ప్రసిద్ధి. కొండల్లో గంజాయిపంట సాగుతుంది. ఈ వ్యాపారంలో అధికార్లకు వాళ్లవాళ్ల వాటాలు వాళ్లకు ఉన్నట్టున్నాయి. ఇక్కడ మొన్నో కథ విన్నాను. క్విట్ ఇండియా ఉద్యమం రోజుల్లో ఎన్.జి. రంగా నాయకత్వాన సాగిన ఒక తిరుగుబాటులో ఇక్కడ జనం ఒకే రాత్రి చిన్న చిన్న రాజులూ, మొఖాసాదార్లూ, జమిందార్లూ — మొత్తం పధ్నాలుగు కోటల మీద దాడిచేసి వాటిని దగ్ధం చేశారట. ఆ తిరుగుబాటులో పాల్గొన్నాయన ఆనాటి ముచ్చట్లు చెప్పాడు. మనమడిని బళ్లో చేర్చటానికి ఆయన వచ్చినప్పుడు ఈ పోరాటగాథలు బైటపడ్డాయి. ఆనాటి స్వరాజ్య విప్లవం అనుభవాలు ఆయన నోటవిన్నప్పుడు ఒళ్లు పులకించి పోయింది. ఆయన్ని చూట్టమే మహాభాగ్యం అన్పించింది. ఇప్పటికీ, ఇన్నాళ్ల తర్వాత కూడా ఆయన స్వాతంత్ర్య యోధుడే అన్పించేంత ఉన్నతంగా ఉన్నాడు. ఆయన ఆ తిరుగుబాటు గురించి చెప్తుంటే ఎంత అదృష్టవంతుడు' అనిపించింది.

మనకంటె మన ముందుతరాలవాళ్లే నయం. చాలా కష్టాలని ధైర్యంగా ఎదుర్కొన్నారు.

నాకాశ్చర్యమేమిటంటే ఇంత గొప్పమనిషి ఉండికూడా ఈ ఊరు ఇట్లా ఇంత దరిద్రంగా ఎందుకు ఉందని?

నాకిప్పుడు పెద్ద కాలక్షేపం ఉత్తరాలు రాసుకోవటమే. దానికితోడు నా పుస్తకాలు ఎట్లానూ ఉండనే ఉన్నాయి.

ఉద్యోగంలో కొత్తగా చేరిన తన ఉత్సాహాన్ని గురించి దినచర్య మోస్తరుగా మిత్రులకు బసవరాజు రోజూ ఉత్తరాలు రాసుకునేవాడు.

ఇప్పుడు మా బడి ఉన్నది ఎక్కడ అనుకున్నారు. ప్రస్తుతానికి — చాలా ఏళ్ల కిందట మూలపడ్డ బియ్యం మిల్లు రేకుల షెడ్డులో. కొత్త ఉపాధ్యాయులు ఇద్దరు వచ్చి చేరారు. వాళ్లు నాకన్నా వయసులో బాగా పెద్దవాళ్లు. ఈ ఉద్యోగంలో పదిహేను, ఇరవైయ్యేళ్లు సర్వీస్ ఉన్నవాళ్లు. సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులు.కుటుంబాలూ పిల్లలూ ఉన్నవాళ్లు. త్వరలోనే కుటుంబాలను ఇక్కడకు తెచ్చుకోవాలని వసతి వెతుక్కుంటున్న వాళ్లూ ఉన్నారు.

బసవరాజును చూట్టానికి సమీపంలోనే ఓ హైస్కూల్లో పన్చేస్తున్న స్నేహితుడు

— హిందీ పండిట్ — ఆ ఊరు వచ్చినప్పుడు 'ఈయన పెద్ద రైతుగారబ్బాయి. ఇంటర్మీడియట్ చదువుకున్నారు. ఈ ఊళ్లో తెలుగు దినపత్రిక ఈయనగారిదగ్గరే దొరుకుతుంది. పేరు వరప్రసాద్' అని పరిచయం చేశాడు.

వరప్రసాద్ కల్పించుకుని 'మేష్టరు గారు వచ్చిన తర్వాత ఐదారు న్యూస్ పేపర్లు, మూడు నాలుగు వారపత్రికలూ, రెండు ఇంగ్లీషు దినపత్రికలూ, ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ — చాలా వస్తున్నాయి. ఊళ్లో రీడింగ్ రూమ్ ఒకటి పెట్టుకోవాలనుకుంటున్నాము' అని తన చొరవ గురించి చెప్పుకుని 'మా ఊళ్లో దాదాపు పాతిక ముప్పయిమంది దాకా ఎస్ ఎస్ ఎల్ సీ పియూసీ వరకు చదువుకున్న కుర్రాళ్లయితే ఉన్నారండి. వాళ్లు సినిమాలకు ఎంతైనా ఖర్చుపెట్టారు కాని పుస్తకాలంటేనే పడదు...' అని పెదవి విరిచాడు. ఇరవై రెండేళ్లుంటాయేమో, మనిషి చాలా నెమ్మది. మాటల్లో గొంతులో వినయం. 'మాష్టరుగారు మాకొక గ్రంథాలయం' అని ప్రశంసించాడు బసవరాజుని ఆ వరప్రసాద్.

సెలవురోజుల్లో బసవరాజుకు ఆ ఊళ్లో ఉన్న ఒకే ఒక టీకొట్టు దగ్గర మంచి కాలక్షేపం. ఊళ్లోని కథలన్నీ అక్కడ తెలిసేవి. తెన్నేటి విశ్వనాథం, టంగుటూరి ప్రకాశంపంతులూ, వావిలాల గోపాలకృష్ణయ్యా, పుచ్చలపల్లి సుందరయ్యా, గౌతు లచ్చన్నా, ఎన్. జి. రంగా, కాంగ్రెస్ ప్రభుత్వంలో మినిష్టర్లూ — ఆ పేర్లన్నీ బసవరాజునోట విని ఆశ్చర్యపోయేవారు అక్కడ చేరిన జనం.

'ప్రధానమంత్రి నెహ్రూ గారిని చూసినావా మేష్టరు గారూ' అని తలనెరిసిన ఒక పెద్దవయసు రైతు అడిగితే చూసినట్టు తల ఊపాడు బసవరాజు. అప్పుడా ముసలాయన సంతోషం చూడాలి. దేవుణ్ని చూసినట్టు చెప్తే పొందేంత సంతోషించాడు. అంతేకాదు రాజాజీ, హిరేన్ ముఖర్జీ, జయప్రకాష్ నారాయణ్, కృష్ణమీనన్, మొరార్జీ దేశాయ్, రామ్ మనోహర్ లోహియా, అటల్ బిహారీ వాజ్‌పేయి, వినోబాభావే, శ్రీపాద అమృత డాంగే, బిజూ పట్నాయక్, జ్యోతిబసు — వీళ్లందరి పేర్లూ చెప్పి బసవరాజు వారిని నిజజీవితంలో కలుసుకున్నట్టు విని 'హెడ్మాష్టరు చిన్నవాడు కాదురో' అనుకున్నారు.

అట్లా జనం మధ్య గౌరవంగా ఆ ఊళ్లో కొత్త అధ్యాయం మొదలు పెట్టిన బసవరాజును — ఆ రాత్రిపూట — ఆ ఇరుకు వీధిలో — రాందాసు ఇంటి ముందు — ఆ జనం చుట్టుముట్టి నుంచునే సరికి —

బసవరాజు వణికిపోయాడు. ఒళ్లంతా చెమటల్లుపోశాయి. ఏడుపు ముంచు

కొస్తున్నప్పటికీ అణచిపెట్టుకున్నాడు. అక్షరంముక్కరాని ఈ పల్లెటూరి రైతులు ముందు దోషిగా తలవంచుకున్నాడు.

చెప్పినంత సులభంకాదు ఆదర్శాలను ఆచరించడం. అమాయకుడైన ఆదర్శవాది బసవరాజు అనుకున్నాడు తన గురించి తనే.

తన ఆదర్శంలో ఇంత ఆపద దాగి ఉన్నట్టు తను ఊహించలేదు.

ఆ పల్లెటూరు అమ్మాయిలో ఎల్లోరాగుహల్లోని శిల్పసుందరుల అపురూపమైన అందం కన్పించింది. పొడుగైన శరీరంతో ఆమె నర్తకిలాగ కన్పించింది. ఆమె గాయకిలాగ కన్పించింది. ఆమె నిండు చందమామలాగ కన్పించింది. ఆమె కొండల మధ్య ఇరుకు లోయలో సన్నటి వాగులాగ కన్పించింది. ఆమె ఉదయకాంతిలో పూలతోటలా కన్పించింది. ఆమె రూపు రేఖల తేజోవిలాసం ముందు, ఆ యౌవ్వన సౌందర్యపు వెన్నెలజల్లు ముందు మోకరిల్లాలనుకున్నాడు బసవరాజు. తనను తాను ఆమెకు అర్పించుకోవాలను కున్నాడు.

ఇప్పుడు అవమానంగా ఉంది. సిగ్గుగా ఉంది. భయంగా ఉంది. పిరిగ్గా ఉంది.

ఆ మోటు రైతులు తనను శిక్షించటానికి సిద్ధంగా ఉన్నారు.

తన చదువూ, సంస్కారమూ, తన ఆదర్శమూ, తన దీక్షా — ఆ ఒక్కరోజులో తారుమారయిపోయాయి. పరిస్థితులు తలకిందులైపోయాయి.

ఆ గ్రామంలో ఆ మామూలుజనం ముందు తను నేరస్థుడయ్యాడు.

అయినా ఆ అమ్మాయి తన కళ్లముందు దేవకన్యలాగానే కన్పిస్తున్నది.

ఇంటామె మామ్మగారు ఈ సంగతి చెప్పి 'నిజమేనా బాబూ?' అని అడిగినప్పుడు బసవరాజు ఆనందం ఆ క్షణంలోనే కుప్పకూలిపోయింది. దుఃఖం ముంచుకొచ్చింది.

ఆ అమ్మాయికి పెళ్లయిందంట.

సూరమ్మ వివాహిత అని తనకు తెలీదు. ఎంత పెద్ద తప్పు!

నిజమా? సూరమ్మకు పెళ్లయిందా? పెళ్లయిందో లేదో ఎట్లా తెలుసుకోవాలి.

వెయ్యక వెయ్యక చాలా పెద్ద తప్పుటడుగే వేశాడన్నమాట. ఇప్పుడేం చేయాలి? ఎట్లా చక్కదిద్దుకోవాలి. ఏం చేస్తే సరిదిద్దు కోవచ్చునో ఎవరు చెప్తారు. మామ్మ చెప్తుందా? మామ్మనే అడగాలి.

'ఏం మేష్టరూ?' అని వాళ్లల్లో ఒకడు మాటాడబోతుంటే 'కొవ్వెక్కిందిరా' అని ఇంకోడు బూతులు తిట్టడం మొదలుపెట్టాడు.

'లంజ కొడుక్కి ఒక్క పోటు పొడిచి చంపండి. సూస్తున్నారింకా' అని మరో రైతు పళ్లు కొరుకుతున్నాడు.

'ఈడూ హెడ్మాష్టరు!'

'ఇస్కూల్లోని ఆడపిల్లల మీద కూడా పడతాడు ఈ గాడిదకొడుకు'

'సూస్తున్నారేంటి. ఎమికాలిరగ్గొట్టక'

వాళ్లమధ్య రాందాసు ఉండి ఈ ఆపద నుండి బసవరాజును కాపాడాడు, వాళ్లను శాంతించమన్నాడు వాళ్ల మాటల్లో కసి, కర్కశత్వం, పగ, ప్రతీకార వాంఛ, ద్వేషం, రోషం, ఈర్ష్య పట్టపగ్గాల్లేని ఉద్రేకంతో... వాళ్లు ఊగిపోతున్నారు. పెద్దవయసు రాందాసు వాళ్లను చల్లార్చాడు.

సూరమ్మలాంటి మంచి పిల్ల, బుద్ధిమంతురాలు ఆ ఊళ్లోనే కాదు ఆ చుట్టు ప్రక్కల ఊళ్లల్లో కూడా ఎక్కడా కన్పించదు. బుద్ధిగల ఆడపిల్ల అంటే ఆ పిల్లనే చెప్పుకోవాలి. ఈ ఊళ్లో ఆ ఈడు ఆడపిల్లలు ఎందరో ఉన్నారు. లేకేం. కాని సూరమ్మ అంటే ఆ ఊళ్లో అందరికీ అభిమానం. ప్రేమ. రత్నం లాంటి పిల్ల. నిప్పులాంటి పిల్ల. తన పనేమిటో తనది. ఇంత చిన్న వయసులో పండగలూ, పర్వదినాలూ, ఏకాదశలూ, శనివారాలూ, సోమ వారాలు, నోములూ, వ్రతాలూ, పూజలూ, ఉపవాసాలూ, పురాణశ్రవణాలు — ఆ భక్తి శ్రద్ధలు చూసి ఆ పిల్ల అంటే ఊరంతటికీ ముద్దు. అలాంటి మంచి ముత్యం లాంటి పిల్లకు ఆవుదూడ లాంటి పిల్లకు ఆ ఉదయం కోవిల దగ్గర నూతికాడ ఆ రకంగా జరిగినందుకు విన్నవాళ్లంతా బాధపడ్డారు.

బసవరాజును అంతవరకు మెచ్చుకున్నవాళ్లే ఇప్పుడు తిట్టారు. బసవరాజు కనిపించినంత సాధువుకాదని వాడి నిజరూపం ఇప్పుడు బైట పడిందని నిందించారు. ఇట్లాంటి వాడిని ఊళ్లో ఉంచరాదని తగిన శాస్తి చెప్పాలని తీర్మానించుకున్నారు.

ఈ సంగతి తెలిసినవాళ్లంతా రాందాసు ఇంటికి వచ్చి సూరమ్మనీ, సూరమ్మ తల్లీ తండ్రులనీ ఓదార్చి, ధైర్యం చెప్పి ఆ మేష్టరు సంగతి మేం చూస్తాంలే అని భరోసా ఇచ్చి వెళ్లారు.

సూరమ్మ నోరువిప్పి మాటాడబోతుంటే ఆమెను మాటాడనివ్వలేదు వాళ్లు. 'నాకేం చెప్పకు. మాకంతా తెలుసు' అని ఆ పిల్ల నోరు మూసేశారు.

అక్కడ సజీవ దహనం చేస్తున్నట్టుగా ఉంది బసవరాజుకు.

అంతలో అరవైయ్యేళ్లు దాటిన రాందాసు 'ఏం మేష్టరూ?' అని సంజాయిషీ

అడగబోయాడు.

'తప్పయిపోయింది' అన్నాడు బసవరాజు.

'తప్పయిపోయింది' అని రెండోసారి అన్నాడు బసవరాజు.

'ఇంకెప్పుడూ ఇలాంటి తప్పు చెయ్యను... అని ప్రమాణం చేస్తున్నాను' అన్నాడు బసవరాజు.

అప్పుడు తప్పుచేసినందుకు క్షమించమని అడగడమొక్కటే న్యాయం అనిపించింది. వెంటనే 'క్షమించండి. ఈ ఒక్క తప్పు — పెద్ద తప్పే. బుద్ధిలేక చేశాను. ఈ సారికి క్షమించండి. లేదా, మీరు నాకు ఏ శిక్ష విధించినా భరిస్తాను. ఇక మీ ఇష్టం. నేను శిక్షార్హుడనే' అన్నాడు బసవరాజు.

ప్రాధేయపూర్వకంగా చెప్పుకున్నాడు. దయాబిక్షకోసం కన్నీళ్లుపెట్టుకుని బసవరాజు వారిని యాచించాడు.

ఉన్నత గౌరవశిఖరాగ్రం నించి అప్రదిష్టఅధోలోకాలకు కూలిపోతున్నట్టు అన్పించింది బసవరాజుకు.

బూతులుతిట్టూ, మనుషుల్ని ప్రక్కకు నెట్టుకుంటూ, ముందుకు ఉరుకుతూ 'తప్పయిందా? సిగ్గులేదూ, థూ — తగల్నీయండి. తప్పేమిటో తెలిసొస్తాది పేణానికి. జడుస్తున్నారెందుకురా' అని మరొకడు కాండ్రించి అరచి బలమైన తన చెయ్యెత్తాడు. రాందాసు వాడిని వారించాడు. వాడిచేతిని గట్టిగా పట్టుకుని, 'తప్పయి పోయిందన్నాడు కదరా. వొదిలేయండ్రా. వొదిలేయండి... మేష్టరూ యెల్లు. యెల్లు. యెల్లిపో ఇక్కడనుండి... బుద్ధి తెచ్చుకుని మంచోడిగా బతుకు — యెల్లు యెల్లిపో...' అని రాందాసు ఆ గుంపును అటూఇటూ తప్పించి బసవరాజు బైటపడటానికి దారి చేశాడు.

బసవరాజు అక్కడనుండి కదిలి ముందుకు నడుస్తుంటే ఎవరో తన వెనక నించి కత్తులతో పొడవటానికి వెంటాడుతున్నట్టుగా ఉంది. వొళ్లంతా వణుకుతున్నది. అడుగుతీసి అడుగువెయ్యటానికి శక్తిచాలటం లేదు. అక్కడే కుప్పకూలి పోయేట్టుంది శరీరం. అక్కడే నేలమీదపడి భోరున ఏడవాలని ఉంది. ఆ మనుషులముందు నిలవకూడదనుకున్నట్టుంది మనసు. ముందుకు సాగిపోయాడు. కళ్లనిండా నీళ్లు. కటిక చీకటి. అలవాటుగా కాళ్లు తీసుకు పోయాయి ముందుకు. ఇంటి దగ్గర బయల్దేరినప్పుడు ఆకలిగా ఉంది. ఇప్పుడు కడుపునిండా దుఃఖం. అది హోటల్ కాదు. పూర్వకాలపు పేదరాశి పెద్దమ్మ ఇల్లు లాంటిది. ఆ ఇంట్లో వయసు మళ్లిన

పెద్ద వయసు ముసలమ్మ అన్నం పెట్టుంది. ఆ ఊళ్లో తన తోటి ఉపాధ్యాయులు ఇద్దరూ, కొండ ఊళ్లల్లో ఉద్యోగాలు చేస్తున్న ఉపాధ్యాయులు ఇద్దరూ, ఫారెస్ట్ గార్డులు ఇద్దరూ, ఆ ఊరు వి. ఎల్. డబ్ల్యూ ఒకరూ — అక్కడకు భోజనాలకు వస్తారు. రెండు పూటలూ. నెలకు ఇరవై రూపాయలు. కడుపునిండా తిండి పెట్టుంది. ఆ ముసలమ్మ వంటరుచితో పాటు మనసుకూడా ఎంతో మంచిది. తల్లిలాగ ప్రేమతో వడ్డిస్తుంది.

ఆ రాత్రి అన్నం తినటానికి కూర్చున్నాడేగాని నోట్లోకి ఒక్క ముద్దకూడా పోలేదు. వొంట్లో బాగోలేదు అని విస్తరి ముందునించి లేచిపోయాడు. ఆకలి లేదు. అర్ధగంట కింద ఆకలాకలిగా ఉన్నదల్లా ఇప్పుడు ఆకలి చచ్చిపోయింది. రుచి చచ్చిపోయింది.

రేప్పొద్దున్న నూటాఏభైమంది పిల్లల ముందు తలెత్తుకుని నిలబడాలి. ఆ పిల్లలకు చదువు చెప్పటానికి ఉపాధ్యాయుడిగా వచ్చాడు. ఆదర్శప్రాయంగా జీవించాలనుకున్నాడు. గురువుగా పిల్లలప్రేమను సంపాదించుకోవాలను కున్నాడు. తోటివారిపట్ల ప్రేమాభిమానాలతో నడుచుకుంటున్న తనకు ఈ ఆపద ఎదురయింది. ఆ కొత్త ఊళ్లో తన కొత్త స్నేహితులముందు, తోటి ఉపాధ్యాయులముందు, తనపట్ల ప్రేమతో చూస్తున్న ఆ ఊరుజనంముందు ఇప్పుడు తాను దోషి. శిక్షార్హుడయిన నేరస్థుడు. ఈ రాత్రికి తనకు శిక్ష తప్పినా రేపు తప్పక ఉంటుంది. రాందాసు 'బుద్ధి తెచ్చుకుని మంచోడిగా బతుకు' అన్నాడు గాని ఊరు క్షమిస్తుందా? పాపం బసవరాజు అంటారు. జాలి పడతారు. సానుభూతి చూపుతారు. మంచి మాటలు చెప్పి ఓదారుస్తారు. సలహాలు చెప్తారు. బుద్ధులు బోధిస్తారు.

గ్రామపెద్దలతో ధైర్యంగా మాటాడేనైతికబలం మళ్లీతాను సాధించు కోగలడా? జిత్తులమారినక్క గ్రామకరణంతో తను నిజాయితీగా మాటాడగలడా?

తెల్లవారితే మనుషులంతా తనను ఎట్లా చూస్తారు?

తన దగ్గర పుస్తకాలు చదవుకోవటానికి తీసుకుపోయే వరప్రసాద్ ఏమంటాడు. విశ్వనాధ సత్యనారాయణ, కొడవటిగంటి కుటుంబరావు, గుడిపాటి వెంకటచలం, శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి, గురజాడ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, నండూరి వెంకట సుబ్బారావు, వేదుల సత్యనారాయణ, మల్లాది రామకృష్ణ శాస్త్రి, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, ఆరుద్ర, జంధ్యాల పాపయ్య శాస్త్రి, బుచ్చిబాబు — ఈ సాహిత్యమంతా చదివి చివరకు మీరు సాధించిన సంస్కారం ఇదేనా మేష్టారూ అంటాడా వరప్రసాద్? ఫారెస్ట్‌గార్డులు మామూళ్లు పుచ్చుకోవటం గురించి ఇంక తను నోరెత్త కూడదు.

ప్రెశిడెంట్ రెడ్డితో పదవుల్లో ఉన్న రాజకీయనాయకుల అవినీతి గురించి మాటాడకూడదు. దొంగసారా వ్యాపారం చేసుకుంటున్న సత్యనారాయణతో 'ఇంకో మంచి బిజినెస్ ఏదన్నా చూసుకోకూడదా?' అనకూడదు. షావుకారులో 'అయ్యా లైసెన్సులు లేకుండా ఈ మందులు అమ్మకూడదు తెలీదా?' అనటానికి వీల్లేదిపుడు. నీళ్లు కలిపి పావలాకు శేరుపాలు పోసే బదులు ఆ మంచిపాలు శేరు అర్ధ రూపాయికే పొయ్యొచ్చుకదా పాలమ్మా' అని పాలామెతో నీతులు చెప్పకూడదు. మంచోడు మేష్టరు. మా మంచోడు మా మేష్టరు అన్న నోళ్లే రేప్పొద్దున్నే 'ఈడేనా' అని ఈసడింపు చూపు చూసి మొహాలు తిప్పుకుంటారు కదా.

బసవరాజు తిరిగి అదే వీధిలోంచి అడుగు తీసి అడుగువేసుకుంటూ తన గదికి వెళ్లాడు. అమ్మా నాన్నా గుర్తొచ్చారు. ఈ అవమానం గురించి తెలిస్తే వాళ్లు ఎంత బాధ పడతారో! ఎంత సిగ్గుపడతారో! ఎంత అవమానపడతారో! పెళ్లి చేస్తామంటే తాను వద్దన్నాడు. తాను స్వంతంగా — పెద్దలు తెచ్చిన సంబంధం కాకుండా — తాను ఇష్టపడిన అమ్మాయిని పెళ్లిచేసు కుంటానన్నాడు. తనకు ఒక యోగ్యురాలు దొరక్కపోదు. తన ఆదర్శభావాలకూ, సంస్కార భావాలకూ ఆదరమున్న స్నేహితురాలు దొరికినప్పుడే తన పెళ్లి. తన ఆదర్శాలకు సంబంధించి రాజీ ఉండకూడదు. ఆస్తులూ, కట్నాలూ, కులాభిమానమూ, ఉద్యోగహోదా — వీటన్నిటికీ అతీతంగా మనసిచ్చే మనిషి తనక్కావాలి.

సూరమ్మను చూసిన తొలిరోజునే నండూరి సుబ్బారావుగారి యెంకి చివరకు ఇక్కడ ప్రత్యక్షమయిందనుకున్నాడు బసవరాజు. తన ఆదర్శాలకు ఆమె ప్రతిరూపంగా అవతరించినట్టయింది.

తను మంచివాడు. బసవరాజు మంచివాడు.

అది బసవరాజు స్వీయాభిప్రాయమే అయినా ప్రపంచం తనను అట్లాగే చూడాలని ఆకాంక్షించాడు బసవరాజు.

వాళ్ల నాన్నగారు హైస్కూల్ హెడ్మాష్టరు. ఆయన విద్యార్థులంతా తమ హెడ్మాష్టరు గురించి గొప్పచెప్పుకుంటారు. ఆయనకు రాజకీయాలంటే ఇష్టం. పత్రికలంటే ఇష్టం. వాళ్ల అమ్మగారు బాగా చదువుకున్నారు. ఆమెకు యూనివర్సిటీ డిగ్రీలు లేవు. కాని సంగీతంలో మంచి సాధన చేశారు. ఆమె బాగా పాడతారు. వీణ వాయిస్తారు. పాట కచ్చేరీలంటే ఆమెకి ప్రాణం. ఆమెకు సాహిత్యం ఇష్టం. చాలామంది రచయితలను ఆమె స్వయంగా ఎరుగును. తల్లి దండ్రుల ఆ

సాంస్కృతిక అభిరుచుల నేపథ్యంలో పెరిగిన బసవరాజుకు సంగీతం అబ్బింది. సాహిత్యం అబ్బింది. కాలేజీరోజుల్లో బసవరాజు దేశమంతా తిరిగాడు. ఎ.ఎస్. రామన్‌ని చూట్టానికి బాంబే వెళ్లాడు. గంగానదినీ, బిస్మిల్లా ఖాన్‌నీ చూట్టానికి వారణాసి వెళ్లాడు. ఎమ్. ఎస్. సుబ్బలక్ష్మిని చూట్టానికి మద్రాసు వెళ్లాడు. ఢిల్లీలో ఎమ్. చలపతిరావు, సతీష్ గుజ్రాల్, యామినీ కృష్ణమూర్తి, కార్టూనిస్ట్ శంకర్ — ఇంకా చాలామందినే చూశాడు. అమ్మతో. నాన్నతో. తాతయ్యతో. పెద్దనాన్నలతో. చిన్నాన్నలతో. చుట్టాలతో. స్నేహితులతో. అలా కలిసొచ్చేవి ప్రయాణాలు.

నాన్నకు చాలా ఇష్టం ప్రయాణాలు.

అమ్మకు చాలా ఇష్టం యాత్రలు.

రెండూ ఒకటే తనకు.

తన జీవితంలో నిచ్చెనలు. వైకుంఠపాళిలో — అన్నీ తనకు నిచ్చెన్లే. అట్లా పైఅంతస్థుకు చేరుకుని ఇప్పుడు పాముునోట్లో పడ్డాడు. మళ్లీ మొదటి కొచ్చాడు.

తన బాల్యం అమ్మమ్మ తాతయ్యల ఇంట్లో గడించింది. అక్కడ జీవితం ఆ సంప్రదాయాలూ ఆ రోజుల్లో చాలా ఇష్టం. గౌరీ పౌర్ణమి వెన్నెల రాత్రులు ఊళ్లో జరిగే ఉత్సవాల్లో, వినోదాల్లో వేషాలు వేసి, పాటలు పాడి, బాలబసవరాజు సంతోషించేవాడు. దీపావళి పండగ బాణసంచా — ఒకటే చూపు. ఆ రంగు రంగుల దీపాల వెలుగు. మతాబులు, కాకరపూలు. ఆ వెలుగులు. ఆ చప్పుళ్లు. కార్తీకమాసం వేకువజాము చీకట్లో ఆడవాళ్లతో పాటు నదికి వెళ్లి, అరటి దొన్నెల్లో దీపాలు ఉంచి వేలాది దీపాలు ప్రవాహంలో పోతుంటే ఆ అపురూప దృశ్యంతో పరవశించిపోయేవాడు. మాఘమాసంలో వణికించే చలిలో నదిలో స్నానాలు, ఇరుగు పొరుగు జట్టుగాళ్లతో ఆటలు. సంక్రాంతి రోజుల్లో ఇంటి ముందు భోగిమంటలు వేసుకుని కూర్చున్న పెద్దవాళ్లతోపాటు తనూ కూర్చుని వాళ్లు పాడుకునే పాటలు వినేవాడు.

శివరాత్రి — శివాలయంముందు భాగవతాలూ, హరికథలూ, భజనలూ, నృత్యాలూ, పూజలూ, ఆ ప్రసాదాలూ, ఆ జాగరణలూ — అదంతా ఒక సాంస్కృతిక వైభవోజ్వల దృశ్యం. అట్లాగే శ్రీరామనవమి — భాగవతాలూ, హరికథలూ, భజనలూ — అన్నీ మామూలే. ఆ గాయకుల్నీ, ఆ నటీనటుల్నీ, ఆ సంగీతకారుల్నీ, ఆ హరిదాసుల్నీ, వాళ్ల దుస్తుల్నీ, వాళ్ల అలంకరణల్నీ, వాళ్ల మాటల్నీ, వాళ్ల రూపు రేఖల్నీ చూడటం — ఎంతో అద్భుతంగా ఉండేది. ఏ గంధర్వలోకాలనించో

వచ్చినట్లు ఉండేవాళ్లు. ఆ కిరీటాల్లో, ఆ రంగుల్లో, ఆ రాత్రులు ఎంత ఘనంగా ఉండేవి! అప్పుడప్పుడే మామిడి కాయలు వచ్చేవి. రైతులు పళ్లు తెచ్చి ఇచ్చేవాళ్లు.

గ్రహణాల రోజుల్లో సముద్రానికి పోయి, కెరటాలతో ఆడుకుని, స్నానాలు చేసి, దగ్గర్లోనే ఉన్న మంచినీటిచెరువుల్లో మరొకసారి స్నానాలు చేసి వచ్చేవాళ్లు.

ఇంటిముందు తులసికోటకు నిత్యం పూజ. నాగుల చవితికి పుట్టల్లో పాలు పొయ్యడం, మర్రిచెట్టుకింద త్రినాధస్వామి వ్రతం, పెద్దలతో సింహాచలం, ముఖలింగం, అరసవెల్లి, శ్రీకూర్మం యాత్రలు.

ఇప్పుడా జీవితం అంతా ఛాదస్తంగా అన్పిస్తున్నది. ఆ ఆచారాలు చాందసాలుగా అన్పిస్తున్నాయి. భారతీయ జీవితవిధానం ప్రకృతిసౌందర్యంతో తాదాత్మ్యం చెందటం. ఒకఆధ్యాత్మిక అనుభూతిని పొందటం. ఇంత ప్రాకృతికమైన అనుబంధాన్ని జీవిత విధానంగా స్వీకరించటం ప్రపంచంలో ఏ జాతీ సాధించుకోలేదు... అని ఓ సారి తమ తెలుగు లెక్చరర్ క్లాసులో చెప్తే, పశువులు ఈ ప్రపంచంలో సుఖదుఃఖాలకు అతీతంగా నిర్వికల్పంగా ఉన్నాయని ప్రశంసిస్తునట్టుంది మీ బోధన... అని ఖండించాడు బసవరాజు.

ఏం ఎందుకు ఎద్దు మాంసం తినకూడదు. మన ఆహారసమస్య, ప్రపంచదేశాలలో మనపేదరికం, రోజురోజుకీ అదుపు తప్పి పెరుగుతున్న మన జనాభా పెరుగుదల, మన దేశగౌరవం, మనదేశ రుణభారం, మన ప్రజల అనారోగ్యం— వీటికన్నా మనసనాతన మూఢనమ్మకాలే పవిత్రమైనవన్నమాట!' అన్నది బసవరాజు వాదన.

బసవరాజు కొత్తప్రపంచం గురించి తెలుసుకున్న తర్వాత, ఇంగ్లీషు పుస్తకాలు చదువుకున్న తర్వాత, జీవితం గురించి భౌతికంగా హేతుబద్ధంగా ఆలోచించటం నేర్చుకున్న తర్వాత — తను ఎదిగాననుకున్నాడు. తనకు మంచి చూపు వచ్చిందను కున్నాడు. తను మనిషిలాగ ఇప్పుడు బతుకుతున్నాడు అనుకున్నాడు. తను బాగుపడ్డాడు అనుకున్నాడు నిశ్చితంగా బసవరాజు.

అతడి కొత్తచూపు, అతడి మంచితనం, అతడి బాగు, అతడి ప్రగతి, అతడి ఆదర్శం, అతడి విద్య, అతడి విజ్ఞానం, అతడి అన్వేషణ, అతడి సాధన, అతడి అభ్యుదయం — అన్నీ ఒక్క మాటలో, ఒక పల్లెటూరు యువతి ముందు, ఆమె యౌవనసౌందర్యం ముందు, తన బుద్ధిహీనత వల్ల, తన విచక్షణారాహిత్యంవల్ల ఒక్క నిముషంలో మంటకలిసిపోయిన దైన్యస్థితి బసవరాజుకు గుర్తొచ్చింది. ఎంత

తప్పయిపోయింది! ఇప్పుడు లోకాన్ని ఎలా చూడటం?

ఆ రాత్రి బసవరాజు ఒక్కడూ ఆ చిన్న మట్టిగోడలు, ఆముదపు దీపం గదిలో కన్నీరు మున్నీరుగా ఏడ్చాడు.

బసవరాజుకు సూరమ్మ గుర్తొచ్చింది. ఆ అమ్మాయి పదహారేళ్లది. తేనెరంగు శరీరం. అందాలకి తోడై ఆకర్షించే యౌవనవైభవం. ఆ వయసుకు దీటైన ఆరోగ్యం. అడవుల్లో పుట్టి అడవుల్లో పెరిగిన అందాలు. కొండల్లో పుట్టి లోయల్లో ప్రవహించిన వాగుల్లాంటి చైతన్యం. చెట్ల నీడల్లో, పూల పరిమళాల్లో, ప్రవాహగమనంలో తొణికిసలాడే నాజూకుతనం. ఇంద్రలోకంనించి శాపగ్రస్తంగా వచ్చిన గంధర్వకన్యలు గురించి అమ్మమ్మ చెప్పిన కథలన్నీ, చందమామ పత్రికలో చదివిన కథలన్నీ గుర్తొచ్చాయి. ఇదంతా తన ఉద్రేకమేనేమో, తన యౌవన శృంగార ప్రభావమేనేమో, తన భ్రమేనేమో — తన కళ్లకు నమ్మశక్యంకాని ఈ దృశ్యప్రపంచంలో సూరమ్మ — పరమ ఆత్మీయురాలై సమీపిస్తున్నట్టు — అంతా మాయజాలంలా కన్పించింది. ఎంత తెలివి తక్కువతనం! ఎంత తొందరపాటు! తల్లితండ్రులనించి వారసత్వంగా తాను తెచ్చుకున్నది ఈ వక్రదృష్టినేనా? తన కుటుంబ గౌరవ మర్యాదలు, తన విద్య, దాని మహోన్నత ప్రభావం, తనచుట్టూ ఉన్న ప్రపంచం ఇచ్చిన సంస్కార భావజాలం, ఆచరణశుద్ధి — ఇవన్నీ తన తొందర పాటుతో కదా భంగమయ్యాయి!

అంత మంచి అమ్మాయి సూరమ్మ. పెళ్లయిన ఆ అమ్మాయి నిర్మలమైన ముఖం మీద తను మసిపూశాడు. అమాయికమైన ఆమె అందం మీద బురద చిమ్మాడు. ఎంత ఘోరం! ఎంత తప్పు! ఎంత చెడ్డపని!

ఒక సామాన్యమైన పదహారేళ్ల అమ్మాయి చూపులను అంత తప్పుగా, వక్రంగా అర్థం చేసుకున్న తను ప్రపంచంలో దేన్ని నిజంగా, వాస్తవంగా, అర్థం చేసుకున్నట్టు? ఏం అర్థమయినట్టు? అలా ఆలోచించగా బసవరాజుకు ప్రపంచం ఏమీ అర్థం కానట్టూ, ప్రపంచానికి ఏమీ అర్థం లేనట్టూ బోధపడింది. అతడికి ఎందుకని తల్లి తనకన్నా తమ్ముడంటే ఎక్కువ మమకారం చూపిస్తుందో అర్థం కాలేదు. అక్క 'నీ గురించి నాకేం బోధపడదురా' అని ఎందుకంటుందో అర్థం కాలేదు. నాన్న తమ్ముళ్లతో చెప్పినట్టుగా తనకెందుకు ఇంటి విషయాలు చెప్పడో అర్థం కాలేదు. చెల్లెలు 'నువ్వా అన్నయ్యా, వదినొస్తే మమ్మల్ని మరిచిపోతావన్నయ్యా' అని ఎందుకు అంటుందో కూడా అర్థంకాలేదు.

తనలో ఏదో పెద్దలోపం ఉంది.

బసవరాజుకు సైన్స్ చూపించిన అనంత విశ్వం కండ్లముందు కనబడింది. కోట్ల కోట్ల నక్షత్రాలు. ఆ నక్షత్రాల్లో అతి చిన్న — అతి చిన్న నక్షత్రం సూర్యుడు. ఆ సూర్యుని చుట్టూ చిన్న చిన్న గ్రహాలు. ఆ గ్రహాలలో ఒక చిన్న గ్రహం భూమి. ఆ భూమ్మీద కోట్లాది ప్రాణులు. ఆ ప్రాణుల్లో ఒక చీమకూడా ఉంది. ఒక బసవరాజు కూడా ఉన్నాడు. ఆ ప్రాణులలో చాలామంది బసవరాజులు మట్టిలో కలిసి పోయారు. ఇంకా చాలా మంది బసవరాజులు ముందు ముందు మట్టిలో కలిసిపోతారు.

బసవరాజుకు అదే సమయంలో అతడు నేర్చుకున్న చరిత్రపాఠాలు కూడా గుర్తొచ్చాయి. సర్వభోగభాగ్యాలూ, ఐశ్వర్యాలూ అనుభవించి చివరకు కిరాతకంగా,అమానుషంగా, చరిత్రహీనులై మట్టిలో కలిసిపోయిన ధరాధిపతులు చాలామంది గుర్తుకొచ్చారు. ఆ రాజ్యవంశాల ఘనచరిత్రను కాలం తన కాలిధూళిలో ఎట్లా కప్పెట్టేసిందో అర్థమయింది.

* * *

రంగురంగుల మేఘాల్లోంచి కొత్తరోజు పసితనంతో ఉదయించింది. ఆ రాత్రి చాలా పెద్ద వర్షం కురిసినట్టుగా ఉంది. ప్రకృతి అంతా తడిసిపోయింది. ఇళ్ల పైకప్పులన్నీ ఇంకా తడి తడిగానే ఉన్నాయి. వారం పది దినాల కిందటే వరి ఊడ్పులు పూర్తయ్యాయి. ఆ పొలాలు, తెల్లటి నీటితో నిండి తొలిసంజ వెలుగులకు అద్దం ముక్కల్లా మెరుస్తున్నాయి. ఊరుకు పడమరగా మహేంద్ర తనయ తొలియౌవనంలా ఉప్పొంగి ప్రవహిస్తూ ఉంది. ఆ వెనక దూరంగా కొండలవరసలు పచ్చటిఅడవులతో, నిర్మలంగా, మౌనంగా, గంభీరంగా కనబడుతున్నాయి. పైన ఆకాశం కడిగేసినట్టుగా ఒక్క మబ్బు తునక కూడా లేకుండా నిర్మలంగా ధరాతలం అందాలని చూసి విస్తుపోతున్నట్టుగా ఉంది.

ఆ ఉదయం సూరమ్మ తమ ఇంటి ముందు ఆవుల సాలలో పేడలు తీసి సుబ్బరం చేస్తున్నది. కాని ఆ పిల్ల మనసు మనసులో లేదు. రాత్రి మేష్టరును కొట్టబోయారు. ఉదయం కోవిలి దగ్గర జరిగిన సంగతి ఇంట్లో చెప్పినప్పుడు అంత ఆపద వస్తుందనుకోలేదు. ఆ పిల్ల మేనమామ ఒకాయన దగ్గర పొలం గట్టు మీద తమను చూస్తూ కన్పించాడు. తనతో మేష్టరు మాటాడటం మేనమామ విన్నట్టున్నాడు. ఆ సంగతి ఇంట్లో ఆయనే అమ్మ ముందు అడిగాడు. ఉన్నదున్నట్టు చెప్పటంతప్ప అప్పటికప్పుడు అబద్ధం కల్పించి చెప్పటం సూరమ్మకు చేతకాలేదు. ఏం

చెప్పాలో ఎలా చెప్పాలో కూడా ఆ సమయంలో ఆ అమ్మాయికి తోచలేదు. ఆ చెప్పడంతో ఈ రకంగా పెడర్థాలు తీసారు. అనవసరంగా అంతా కలగజేసుకున్నారు. రాత్రి అయ్యో ఆ మేష్టరు ఎంత బాధపడ్డాడో. ఏమయిందో.

బసవరాజు అంటే ఆమెకు చాలా ఇష్టం. మంచివాడు. నిన్న పిలిచి తనతో మాట్లాడినప్పుడు చదువు గురించి అడిగాడు. పుస్తకాలు చదువుతావా అని అడిగాడు. పాటలు అంటే ఇష్టమేనా అని అడిగాడు. రేడియో వింటావా అని అడిగాడు. పాటలు పాడతావా అని అడిగాడు. పల్లెపాటలు మాత్రమే వచ్చును అని చెప్తే — ఒక పాట పాడి వినపించకూడదా అన్నాడు. అంతే దాంట్లో చెడ్డ మాటలు ఏవీ లేవు. ఆ మాటలు రాత్రంతా గుర్తొచ్చాయి. ఇంటి ముందు జరిగిన గొడవమూలంగా సూరమ్మకు ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఇవే పదేపదే గుర్తురాసాగాయి.

అమ్మ వేకువజామున అందరికన్నా ముందు నిద్రలేస్తుంది. కవ్వం పట్టుకుని చల్లకుండ దగ్గర కూర్చుంటుంది. పిన్ని లేచి వంటగదికిపోయి అక్కడ పనులు మొదలు పెట్టుంది. అయ్యలేచి దూడలను విడిచిపెట్టి పాలుతీసి తెస్తాడు. చిన్న పిన్ని కసవు ఊడుస్తుంది. తాతయ్య పొలాలవేపు వెళ్తాడు. నాయినమ్మ అందరికీ ఇంటిపనులు చెప్పి చేయిస్తుంది. అత్త నూతినించి నీళ్లుమోసుకువస్తుంది. తను సాలలోని పేడలు తీసి కోవిలి మెట్టమీద తమ కూరగాయల దొడ్డిలో పిడకలు చేసి, వాటిని ఎండకి పెట్టి, పాత ఎండిన పిడకల్ని కుచ్చెర్లలో పెట్టి, ఇంటికి కూరగాయలు తీసుకుని వస్తుంది. నిన్న చేతులు కడుక్కోవటానికి కోవిలి దగ్గర నూతి కాడికి వెళ్లినప్పుడు కోవిల్లోని దేవుడు మోస్తారుగా మేష్టరు కనిపించాడు.

రోజూ బసవరాజు నదిలో స్నానంచేసి వస్తాడు. గత కొన్ని రోజులుగా వర్షాలు వల్ల నదిలో బురదనీరు మూలంగా ఇప్పుడు బసవరాజు దార్లోనే ఉన్న కోవిల నుయ్యి దగ్గర స్నానం చేస్తున్నాడు.

భళ్లున తెల్లవారింది. ఇంట్లో మనుషులు అటూ ఇటూ తిరుగుతున్నారు. అమ్మ, సాలలో పేడలు తట్టల్లో ఎత్తుతున్న తన దగ్గరకు వచ్చి సూరమ్మ చేస్తున్న పని సగంలో ఆపేసి ఆమెను లోపలి గదిలోకి చేయిపట్టుకుని లాక్కుంటూ తీసుకుపోయింది.

ఊర్లో పరుగులూ, తెల్ల ముఖాలూ, ఆశ్చర్యాలూ, భయాలూ, అయ్యయ్యో ఎంత ఘోరం జరిగిపోయింది అనుకోవడాలూ, అన్నీ అర్థం చేసుకునే సరికి చివరకు బసవరాజు మేష్టరు ఉరిపోసుకుని చనిపోయాడని ఊళ్లో అందరికీ తెలిసింది.

వేకువజామున లేచి రోజూ పిలిచినట్టే మామ్మగారు పిలిచారట. బసవరాజు

పలకలేదట. ఇంకా నిద్ర పోతున్నాడులే అని ఊరుకుందట. తర్వాత పాలమనిషి పాపమ్మవచ్చి కేకేసింది. పలకలేదు. రాత్రంతా నిద్రలేక ఆలస్యంగా నిద్రపట్టిందేమోనని మామ్మగారు పాలు తీసుకుని అతడి గదిలో పెట్టేయాలని లోపలికి వెళ్లే సరికి మంచం మీద మనిషి కన్పించలేదు. ఇంటి చూరు మధ్య వాసానికి లుంగీ కట్టి, లుంగీకి బెడ్డింగ్ తాడు కట్టి మనిషి వేలాడుతున్నాడు. నేలమీద కుర్చీ పక్కకు పడిపోయి ఉంది. ఆ దృశ్యంతో మామ్మ భయపడిపోయి పెద్దగావుకేక పెట్టింది. మామ్మ కేకవిని పాలు ఇచ్చేసి పోతున్న పాపమ్మ తిరిగి చూసి, వెనక్కి వచ్చింది. మామ్మ కొడుకూ కోడలూ చిన్న కూతురూ వచ్చిచూసి అంతా భయపడిపోయి కళ్లుమూసుకున్నారు. తలుపు దగ్గరకు వేసి ఉంచారు. ఇరుగు పొరుగు వచ్చారు. ఆ వీధిలో వాళ్లంతా వచ్చారు. నాయుడు వచ్చాడు. ప్రశిడెంట్ వచ్చాడు. కరణం వచ్చాడు. మనుసుల్నెవర్నీ లోపలికి పోవద్దన్నారు. మేష్టర్లు వచ్చారు. తర్వాత వచ్చిన జనంతో ఇంటిముందు పశువుల సాల నిండిపోయింది. బయట ఆ ఇరుకు వీధిలో గుంపులు గుంపులుగా అంతా నిలబడ్డారు. వరప్రసాద్ వచ్చాడు. సెట్టి వచ్చాడు. రాందాసు వచ్చాడు. ఫారెస్ట్ గార్డులు వచ్చారు. ఊరు జనం అంతా వచ్చారు. మనుషులే మనుషులు. ఆడా మగా పిల్లా పెద్దా అంతా. అందరి ముఖాల్లోనూ భయం బాధ.

ఆ ఊళ్లో ఎగురుతున్న జెండాలేవీ బసవరాజును రక్షించలేకపోయాయి. తను చదువుకున్న చదువుగాని, మహా రచయితల గ్రంథాలు కాని, అతడు ఆదర్శంగా పెట్టుకున్న అభ్యుదయం గానీ అతడిని రక్షించలేకపోయాయి.

బసవరాజు వేళ్లాడుతున్నాడు.

మామ్మ గుండెబాదుకుని, చచ్చిపోయిన తనకుమారుడిని గుర్తు తెచ్చుకుని స్వంత తల్లిలాగ ఏడుస్తున్నది.

ఆ రాత్రి రాందాసు ఇంటి ముందు జరిగిన గొడవ గుర్తుచేసి ఏడుస్తున్నది.

అంతా మనమంచికే నాయినా, కష్టాలు మనిషికి రాకపోతే మానుకొస్తాయా. ఈళ్లంతా పుణ్యాత్ములూ నీ వొక్కడివే పాపాత్ముడువా? నాయినా చిన్నోడివి. భయపడొద్దు. మనసు గట్టిచేసుకో అని రాత్రి మామ్మ బసవరాజుతో చెప్పి ఓదార్చాలనుకుందట. కాని చెప్పలేకపోయిందట. ఆ మాటలు చెప్పి ఉంటే ఇంతఘోరం జరిగేది కాదని ఆమె దుఃఖం.

బసవరాజు వేళ్లాడుతున్నాడు.

అయ్యయ్యో, అయ్యయ్యో... ఆ తల్లీ తండ్రీ ఎక్కడో? ఇప్పుడేం చేస్తారు. వాళ్లకు కబురెలాగ... మా దొడ్డమనిషి... బారికోడిని పోలీస్‌స్టేషన్‌కి పంపించారట. కృష్ణమూర్తి గారూ మీరు ఇదే నిమిషం సైకిలేసుకుని పట్నమెల్లి బస్సుపట్టుకుని వాళ్ల ఊరు వెళ్లి ఆ తల్లీతండ్రీని కలుసుకుని ఈ సంగతి చెప్పకుండా ఆపదలో ఉన్నాడని చెప్పి తీసుకురండి. మా దొడ్డమనిషి... దించినకళ్లు ఎత్తకుండా నడిచేవాడు. రాత్రి రాందాసు ఏంచేశాడట. ఏమయితేనేం ఒక నిండుజీవితం మునిగిపోయింది కదా. ఆఁ వాడి మనవరాలేమో పెద్ద పతివ్రత. ఈయనేమో పెద్దనీతిమంతుడు. మేష్టరొట్టి పిరికి గుండోడు. దీనికే ఇంత తేగం చేసుకోవాల?

నా నాయినా నీ ముచ్చట్లు నా మనువడు రోజూ చెప్పేవాడురా... ఈ ఊళ్లో నీకు ఆయువు తీరిపోయిందా... మరియాదపోయిందని మానుబావుడు మనసిరుసుకున్నాడు. తినేసింది పిచ్చిముండ. సీతారాములుగాడు రైలుకింద తల పెట్టేసి ఇంకా నెలకాలేదు. ఈ ఊరుకు శని పట్టింది. నాయినా నీ కాలం ఈ నేలమీద చెల్లిపోయిందా... పాతికేళ్లు కూడా నిండాలేవు. ఆ తల్లిదండ్రులకు తెలిస్తే... పాపిష్టి ముండ పుణ్యాత్ముణ్ని తినేసింది... ఆత్మహత్యా మహాపాపం... గాడిదగుడ్డు... అంతే మనిషి బతుకు అంతే... తీరైన మనిషి... ఈ బూమ్మిద నూకలు సెల్లిపోయినాయా నాయినా... చచ్చింతర్వాత పాపమో పుణ్యమో ఎవడిక్కావాల... పోలీసులు రాందాసును జైల్లో పెట్టారా... నేను గోడలు దూకాను. అర్ధరాత్రి దాని మొగుడు నిద్రలేచి పెళ్లాన్ని వెతుకుతుంటే... గోడ దూకాలి ఏంచేస్తాం... మగాడు అన్న తర్వాత ఆమాత్తరం రసికత్వం ఉండొద్దా. ఆ వయసులో... పద్దనాభంగాడిని నాయుడు ఎముకలు ఇరగ్గొంటించలేదా. నాయుడు కూతుర్ని పద్దనాబంగాడు పెళ్లిచేసుకుని కాపురం పెట్టలేదా... పోలీసు లొచ్చిం తర్వాత ఏం చేస్తారు... మాటమాత్రంగా నాకీ సంగతి చెప్తే — నేనే రాందాసుతో మాటాడేవాడిని కదా... ఇంతకీ మేష్టరు ఏం చేసినాడరా రాందాసూ... నీ మనవరాలికి కడుపు చేసేసినాడా... మాటాడితే తప్పయిపోయిందిరా... అక్కడ ఆ గడపలో అడుగు పెట్టొద్దు... పోలీసులు వచ్చిందాక. పాపిష్టిముండ ఏం చెప్పిందో... ఎల్లండ్ర ఎల్లండి... ఇక్కడ... బంగారం లాంటి మనిషి... అయ్యో పాపం... రాందాసూ ఊరికి చాలా మంచిపేరు తెచ్చినావురా... రాక రాక ఇస్కూలికి మంచి మేష్టరొకడు వచ్చినాడనుకుంటే... రాందాసూ ఈ అపవాదు నీవే మొయ్యాలిరా. తప్పదు. ఆ పాపం నీదే. నీదే... ఇదేనా లేక ఇంటి చింతలు ఏమన్నా ఉన్నాయా? రాక్షసిముండ తినేసింది... పోష్ట్ మార్టమ్

చేసిన తర్వాతనే శరీరం దొరికేది. వయసు ముదిరిపోతే సరేనా బుద్ధి ముదరాలి...

* * *

సూరమ్మని తల్లి ఇంటినించి కదలనివ్వలేదు సరికదా ఇంట్లోకూడా వంటగదినించి అడుగు బైటకి పెట్టనివ్వలేదు. తల్లీ తండ్రీ నాయినమ్మ చిన్న పిన్ని అంతా సూరమ్మను బందిఖానాలో ఉంచినట్టు కాపలా ఉన్నారు. ఆ పిల్లను ఓదార్చటానికి నిన్న అంతమంది వచ్చారు. ఇవేళ ఒక్కరూ కనిపించలేదు. ఆ రోజు ఆ అమ్మాయికి చర్మాన్ని ఒలిచి నరాలని మొత్తంగా కోసి తీస్తున్నట్టుగా ఉంది. వెళ్లి మేష్టరును చూసి ఆ పాదాల దగ్గర తన పాపానికి ప్రాయశ్చిత్తంగా తల పగలగొట్టుకోవాలనిపిస్తున్నది. తన చుట్టూ కాపలా ఉన్న వాళ్లందర్నీ విదిలించేసి అక్కడనుండి పారిపోయి, మేష్టరు దగ్గర కూర్చుని ఏడవాలని ఉంది. ఏడాది కిందట నూతిలో పడి చచ్చిపోయిన పోష్టమాష్టరు కూతురు — తన ఈడు పిల్లే — తన నేస్తురాలే — గుర్తొచ్చికూడా సూరమ్మ ఏడుపు ఆపుకోలేకపోయింది. నిన్న తాను ఆ సంగతి ఇంట్లో చెప్పకపోతే ఇంత ఘోరం జరిగేది కాదు కదా అని మనసు పదే పదే నిందించసాగింది. ఒక మంచి మనిషి నిండు జీవితం తనే తినేసింది.

సూరమ్మ కళ్లనించి ముందు కన్నీళ్లు తర్వాత రక్తమూ ధార కట్టాయి

ఆ అమ్మాయిని చూట్టానికి ఆమె స్నేహితురాళ్లు కూడా రాలేదు.

* * *

– ఆంధ్ర సచిత్ర వార పత్రిక

*6.1.67*

కథా నిలయం
5817
శ్రీకాకుళం